

# అప్పుల నరసయ్య

మధురాంతకం రాజారాం

"ఈ ప్రపంచం దేనిచుట్టూ తిరుగుతోందో సెలవిస్తారా స్వామీ'' అని వేంకటేశం గనుక ప్రశ్నించివుంటే 'ఆ మాత్రం తెలియదట్రా శిష్యా! ప్రపంచం రూపాయ చుట్టూ తిరుగుతోంది, అంటూ గిరీశం చెప్పివుండేవాడని నా వూహ.

భూచక్రం సంగతేమిటో గానీ మానవ జాతిమాత్రం రూపాయచుట్టూ ప్రదక్షిణం చేస్తూ బ్రతుకుతోందని చెప్పడంలో అతిశయోక్తి ఏమీ వుండదు.

రూపాయచుట్టూ తాము తిరగకుండా తమ వెంట రూపాయను త్రిప్పుకునే వాళ్ళు లోకంలో చాలా అరుదుగానే వుంటారు.

అప్పుల నరసయ్య అలాంటి వాళ్ళల్లో ఒకడేమోనని నా అనుమానం.

అవునో కాదో మీరే చెప్పాలి; అప్పుల నరసయ్య కథ మాత్రం నేను చెప్పగలను.

ఇంచుమించుగా అయిదువందల గడప లున్న రంగంపేటలో అప్పుల నరసయ్యది చాలా పురాతనమైన కుటుంబం. ఒకసారి ఆ యింటివైపు చూస్తే ఒకప్పు డది బాగా బ్రతికిన కుటుంబమని ఎవరికైనా తెలిసిపోతుంది. రంగం పేటలో నేను మకాం పెట్టినప్పటికి ఆ మిద్దె పెచ్చులూడిపోయి, సున్నానికి ముఖం వాచినట్టున్న గోడలతో నిలువు దోపిడికి గురి అయిన అయినింటి ఆడపడుచులా కనిపిస్తుండేది. మిద్దె ముందర చిల్లరకొట్టు. కొట్టులోనుంచి నాలుగుమెట్లు దిగితే మనంపేట బజార్లో వుంటాం. బజారు చిన్నదే అయినా పది పదిహేను చిల్లరంగళ్ళతో, ఏడెనిమిది జవిళికొట్లతో, పల్లెల నుంచి బేరసారాలకు వచ్చే వాళ్ళతో, వాహనాల రాకపోకలతో అదెప్పుడూ సందడిగా వుంటుంది. ఆ బజారులోని కొట్లల్లో మరి దేనికీ లేని ప్రసిద్ధి ఒకటి అప్పుల నరసయ్య చిల్లర కొట్టుకుండేది. దాన్నందరూ ధర్మ సత్రమని చెప్పుకునేవాళ్ళు. ఈ ప్రసిద్ధికి కారణమేమిటో కాలక్రమాన తెలిసివచ్చింది. సాధారణంగా చేతిలో డబ్బులున్న వాళ్ళెవ్వరూ అప్పుల నరసయ్య చిల్లరకొట్టును వెదుక్కుంటూ వెళ్ళేవారు కారు. ఆ కొట్లో పెట్టెలేగాని, పెట్టెల నిండుకూ సరుకు లుండవు. ఏ వస్తువు కోసమైతే అక్కడికి వెళ్తారో అదక్కడ వుండడంగానీ, వుండకపోవడంగానీ వెళ్ళేవాళ్ళ అదృష్టంపైన ఆధారపడిన విషయం. లేని వస్తువును లేదనిచెప్పి వూరుకునేవాడు కాడు అప్పుల నరసయ్య. పప్పుకోసమని వెళ్తే ఉప్పు తీసుకెళ్ళమనేవాడు. అప్పటికప్పుడు డబ్బు అచ్చుకోవలసిన అగత్యం లేదు గనుక, ఏదైతేనేం లెమ్మనుకుని వెళ్ళిన వాళ్ళలాగే రెండు శేర్ల ఉప్పు పడేయమనేవారు. ''అదేమిటయ్యా! ఉప్పేమైనా చెడిపోయే వస్తువా? ఎప్పటికైనా పనికొచ్చేదేగమా! ఏకంగా పదిశేర్లు తీసుకెళ్ళి పోగూడదూ?'' అనేవాడు అప్పుల నరసయ్య. ఏ పిప్పరమింట్లో, బొరుగులో కొనుక్కోదలచిన కుర్ర వాళ్ళు విధిగా అప్పుల నరసయ్య కొట్టుకే విజయం చేసేవారు. మిగిలిన కొట్లతో పోల్చి చూచినప్పుడు వాళ్ళ కక్కడ తినుబండాలు యిబ్బడి ముబ్బడిగా దొరికేవి. ఈ తతంగమంతా గమనించినప్పుడు అప్పుల నరసయ్య లాభాలు గడించడంకోసం కొట్టు పెట్టుకున్నట్టు తోచేది గాదు. ప్రొద్దు పోవడం కోసం యిదొక వ్యాపకంగా ఈ పని చేస్తున్నాడేమో ననిపించేది. నేను బజారుగుండా వెళ్తుంటాను. అప్పుల నరసయ్య కొట్టుపైన కూచుని వుంటాడు.

"ఏమండీ, మేష్టరుగారూ! ఇంతసేపూ పిల్లలతో మొత్తుకున్నారేమో? అప్పుడే యింటికెళ్ళి ఏం చేస్తారు? కాసేపు కూచుని వెళ్ళరుగానీ రండి" అంటాడు. చిల్లరకొట్లో బఠాణీలుంటాయి. వేయించిన శనగపప్పు వుంటుంది. అదీగాకపోతే యింటిలోపల అప్పల నరసయ్య అలవాటుగా తెచ్చిపెట్టుకునే అటుకులుంటాయి. ఏదో ఒక తినుబండారం కాగితంలో పోసి నాచేతి కందిస్తూ అతడు మాటలు మొదలుపెట్టేవాడు. ఉపాహారం ముగించేసరికి "తాయారూ!"అంటూ భార్యను పిలిచి మంచినీళ్ళు తెప్పించేవాడు. బడిలో ఉద్యోగం, ఇంట్లో సంసారం. ఈ రెండింటికీ నడుమ అప్పల నరసయ్య చిల్లరకొట్టు నాకొక విశ్రాంతి మందిరంలా వుండేది.

లోక మేమైపోయినా తమ గల్లా పెట్టె నిండితే చాలుననుకునే వాళ్లు ఎక్కడా వున్నట్టే రంగంపేటలోనూ వున్నారు. అలాంటివాళ్ల దృష్టికి అప్పల నరసయ్య ఒక పిచ్చివాడిలా కనిపించివుంటే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఉదయం నిద్రలేచింది మొదలు, రాత్రి పడుకునేలోగా పరోపకారమని చెప్పుకో దగ్గ పనులు కొన్ని చేయలేకపోతే అప్పల నరసయ్యకు మతి పోయినట్టుండేది. అతడు బిచ్చగాళ్లకు పాత బట్ట లిచ్చేవాడు, పేద విద్యార్థులకు వారాలు ఏర్పాటు చేసేవాడు. ఊళ్లో దిక్కులేని వాడెవడైనా చస్తే, శవదహనానికి తాను ముందుండేవాడు. కొంప కాలిపోయిందనో, కరువొచ్చి పడిందనో ఓ కాగితం వ్రాయించుకుని ఎవరైనా రంగం పేటలో ప్రవేశిస్తే అతడినందరూ అప్పల నరసయ్య దగ్గరికే "డైరెక్ట్" చేసేవారు.

చలికాలపు రోజుల్లో ఒకనాటి సాయంకాలం బడి వదిలిపెట్టి యింటికి వెళ్తుండగా అప్పల నరసయ్య బజార్లో ఎదురయ్యాడు. "ఏమండీ మేష్టరుగారూ! బడి వదిలిపెట్టడానికీ రోజు కాస్త ఆలస్యమైనట్టుందే!" అన్నాడు. అవునండీ! టైం సరిగ్గా తెలియడంలేదు. బడి గడియారం చెడిపోయింది" అన్నాను.

"అయ్యో, అలాగా! నాతో చెప్పారు కారే! నాకు తెలిసివుంటే రిపేరు చేయించేవాణ్ణిగా! సర్లెండి. పై వారం నేను టౌనుకు వెళ్లవలసిన పనుంది, అప్పుడు చేయించుకొస్తాను" అన్నాడు.

గోడ గడియారం చెడిపోయి అప్పటికి నెలరోజులయింది. దాన్ని రిపేరు చేయించాలా, వద్దా? చేయించాలంటే ఎవరు చేయించాలి? అందుకయ్యే ఖర్చు ఏపాటిది? ఈ ప్రశ్నలకు సమాధానం తోచక మే మొకవైపున యింకా సతమతమౌతూ వుండగానే అప్పల నరసయ్య యిలా ముందుకు రావడం నాకు కొంత విస్మయాన్నే కలిగించింది.

కానీ ఈ పనికి పూనుకోడానికి వెనుక అప్పల నరసయ్యకున్న నైతిక బాధ్యత ఏమిటో నాకు తరువాత తెలిసింది. బడికి ఆ గోడ గడియారం బహూకరించినవాడుగూడా అతడే నట.

ఒకసారి బడి వార్షికోత్సవంకోసం బజార్లో చందాలు వసూలుచేస్తూ అప్పల నరసయ్య దగ్గరికి వెళ్ళాను.

పుస్తకంలో రెండు రూపాయలు వేసి అతడొక పదిరూపాయల నోటు తీసుకొచ్చి నా జేబులో పెట్టాడు.

"ఎందుకండీ! ఎందుకిలా చేశారు?" అన్నాను విస్తుపోతూ.

"ఉంచండి మేష్టారూ! వార్షికోత్సవమన్నాక ఖర్చులుంటాయి. కుర్రాళ్ళకు నాలుగు ప్రయిజు లెక్కువగా తెచ్చి యివ్వొచ్చు. మరేం లేదు. నేను గనుక పదిరూపాయలు వేస్తే బజార్లో సాటి పెద్దమనుషుల్ని యిబ్బందిలో పెట్టినట్టవుతుంది. నాబోటివాడు పావలానో, అర్ధరూపాయో వేస్తే వాళ్ళకు దర్జాగా రెండో మూడో వేయాలని వుంటుంది. ఇప్పుడు నేను రెండు రూపాయలు వేశాను గనుక వాళ్ళిక చేసేదిలేక విధిగా అయిదు రూపాయలైనా యిచ్చుకోవలసి వస్తుంది."

నిజమే! అప్పల నరసయ్య చెప్పినట్టుగా బజార్లోని పెద్దపెద్ద ఆసాములందరూ అచ్చు గుద్దినట్టుగా అయిదన్న అంకెనే వేశారు. చందా వేస్తూ ఒక్కొక్కరూ అప్పల నరసయ్యను గురించి ఒక్కొక్కమాట చెప్పారు. "అప్పల నరసయ్య రెండు రూపాయలు వేశాడా? అయ్యో పాపం! జరుగుబాటుంటే పదిరూపాయలైనా వేసేవాడే" అన్నారొకరు. ఇంకొకరు "అప్పల నరసయ్యకేమి? ఎంతయినా వేస్తాడు. అతగాడికి జరుగుబాటు వుండాలని ఎక్కడుంది? అప్పులు దొరుకుతూవుంటే చాలు" అన్నారు. మరొకరు "అప్పల నరసయ్య! రెండు రూపాయ లిస్తానన్నాడా? అతడికేం బాబూ? అప్పులిస్తే అడగడు. అప్పు చేస్తే తీర్చడు అందరికీ అలా జరుగుతుందా? మీకు తెలియదేమో గానండీ మేష్టరుగారూ! అతడి పేరు అప్పల నరసయ్య కాదు. అప్పుల నరసయ్య" అన్నారు ఈ వ్యాఖ్యానాలవల్ల నాకొక విషయం అవగతమైంది. మొత్తంమీద డబ్బున్నవాళ్ళకెవ్వరికీ అప్పల నరసయ్య పట్ల సదభిప్రాయం లేదు.

సదభిప్రాయం మాట దేవుడెరుగు! ఉన్నట్టుండి అతడిపట్ల దారుణమైన దురభిప్రాయం ఏర్పడిపోయే పరిస్థితి ఒకటి పుట్టుకొచ్చింది.

ఒకనాటి ఉదయం భళ్ళున తెల్లవారేసరికి అప్పల నరసయ్య దివాలా తీసేశాడన్న వర్తమానం వూరంతా వ్యాపించింది,

ఇల్లూ వాకిలీ, తోటా దొడ్డీ, పొలమూ పుట్రా అంతా తెగనమ్మినా అప్పులవాళ్ళకు రూపాయ కరవై పైసలకన్నా గిట్టుబాటు కాదట! అంటే ఏమిటి? అప్పల నరసయ్య అప్పులిచ్చినవాళ్లని ముంచేశాడని అంతరార్థం.

కొట్టు మూతబడిపోవడంవల్ల ఈ వార్త విన్న తర్వాత పది పదిహేనురోజులవరకూ నేను అప్పల నరసయ్యను కలుసుకోడం తటస్థించలేదు.

కలుసుకునే సాహసంగూడా నాకు లేదు. లేమిలో పుట్టి లేమిలో పెరిగినవాళ్ళనయితే నేను ఓదార్చగలను. కలిమిలో పుట్టి, కలిమిలో పెరిగి హఠాత్తుగా లేమిలోకి జారిపడ్డ

వాళ్లను ఓదార్చడానికి కావలిసిన మాటలు నాదగ్గర లేవు.

మధ్యవర్తులందరూ ఒకచోట సమావేశమై అప్పల నరసయ్య ఆస్తిపాస్తులకు విలువ కట్టి, ఏ ప్రోనోటు కెంత గిట్టుబాటయ్యేదీ లెక్కలు చూస్తున్నారని కర్ణాకర్ణిగా వింటూ వచ్చాను.

అప్పల నరసయ్య కొట్టు కెదురుగావున్న చిల్లరకొట్లో నేను వాడుకగా సామాన్లు కొంటుండేవాణ్ణి. ఆ కొట్టు యజమాని పేరు హనుమంతు. అత డొకసారి నన్ను జబ్బ పట్టుకుని సూటిగా యింటిలోపలికి తీసు కెళ్ళాడు. "చూశారా మేష్టరుగారూ! మీ అప్పల నరసయ్య ఎంత పనిచేశాడో ఎరుగు దురా?" అన్నాడు.

ఏం చేశాడని ప్రశ్నించాను.


"ఏముందీ? డబ్బూ దస్కం అంతా ఎక్కడో దాచేశాడు. దిడీల్మని బోర్డు తిప్పే శాడు. అప్పులవాళ్ళ పని గోవింద! ఏ మాత్రం దొరికినా దొరికినట్టే నని గింజుక చస్తున్నారు...."

నేను తెల్లబోయాను.

అప్పల నరసయ్య యిలాంటి పాడు పని చేసి వుంటాడని నమ్మలేకపోయాను.

కానీ ఈ ఆరోపణ మళ్ళీ మళ్ళీ నా చెవిలో పడసాగింది. దీన్ని నమ్మలేక పోవడం నా అమాయకత్వానికి నిదర్శనంగా భావించి కొందరు నాపట్ల సానుభూతిగూడా ప్రకటించారు.

మనిషికి కీర్తి రావడమైతే క్రమక్రమంగా వస్తుందిగానీ అపకీర్తిమాత్రం ఉప్పెనలా వచ్చిపడుతుంది. పగటిపూట ఒక మంచి దృశ్యాన్ని చూస్తాం. చీకటి పడ్డాక ఆ దృశ్యం అక్కడ కానరాదు. వట్టి చీకటిమాత్రమే కనిపిస్తుంది. అప్పల నరసయ్య ఆపదల్లో వున్నవాళ్లని ఆదుకున్నవాడే గావచ్చు. అడిగిన వాళ్ళకు లేదనకుండా తన శక్తికొలది చేయి జాపినవాడే గావచ్చు. కానీ అప్పులవాళ్ళని దగా చేశాడన్న అపకీర్తి ఎదుట, అతడి మంచితనమంతా మాసిపోయినట్టే తోచింది.



ఒకానొక ఆదివారం రోజున పగటిపూట బాగా నిద్రపోయానేమో, ఆ రాత్రి నిద్రా దేవత కరుణించవచ్చునన్న ఆశ లేక పోయింది. అలాంటి నిద్రపట్టని రాత్రుల్ని వేగించడానికి నాకు దబ్బారేకుల సినిమా థియేటరు ఒకటే శరణ్యం. వెళ్దామా వద్దా అన్న విచికిత్సలో వుండిపోయి తీరా కాస్త ఆలస్యంగానే బయల్దేరాను. వెళ్ళింది రెండో ఆటకే నని చెప్పడం అనవసరం. గ్రామీణ ప్రాంతం తెల్లవారేదాకా వీధి నాటకాలు చూడ్డానికి అలవాటుపడ్డ జనం. సింగిల్ ప్రొజెక్టరు. ఆ యీ కారణాలవల్ల నేను అర్ధ రాత్రి దరిదాపుల్లో ఎప్పుడో షెడ్డులో ప్రవే శించి వుంటాను. మామూలు ప్రకారం సిని మాలో పాతిక వంతు ముగిసేసరికి రేకుల కప్పుక్రింద గుడ్డి దీపం వెలిగింది. మసక వెల్తురులో ఓ మూలగా కుర్చీపైన కూచుని మూసుకున్న కళ్లను వ్రేళ్ళతో నలుపు కుంటున్న అప్పల నరసయ్య కనిపించాడు.

దగ్గరికి వెళ్ళి అతడి భుజంపైన చేయి వేశాను.

అప్పల నరసయ్య నా వైపు చూశాడు. అతడి కళ్ళు మండుతున్నాయి. చత్వార మింకా పూర్తిగా వదిలిపెట్టలేదేమో, అతడు నన్ను పోల్చుకోడానికి కొద్దిక్షణాలు పట్టింది. "మేష్టరుగారూ! సినిమా కొచ్చారా? నేనూ అందుకే వచ్చాను. కానీ ఏం చూశానో గుర్తు లేదు. రండి, ఇన్ని టీ నీళ్ళయినా త్రాగి వద్దాం...."

లేచి బయటి కొచ్చేశాం. అప్పల నరసయ్య రెండు మిక్శ్చరు పొట్లాలు కొను క్కొని చేత బట్టుకున్నాడు. స్టాల్లోవున్న కుర్రాడితో టీలు పంపమన్నాడు.

"సినిమా ఏమీ బాగున్నట్టులేదు. కాసే

పిక్కడే కూచుందామా ?'' అన్నాడు.

ఆరుబయట వేసివున్న బెంచీపైన కూర్చున్నాం.

అతడి వేషం వైపు చూస్తూ ''మీరు సినిమా కోసం బయల్దేరినట్టులేదు'' అన్నాను.

''చొక్కా యింట్లో వుండి పోయింది లెండి! అరుగుపైన పడుకున్నాను. గాలి కదలడంలేదు. వెళ్ళి మిద్దెపైన పడుకుందా మనిపించింది. ఆ మిద్దె నాలుగు రోజుల క్రితం వరకూ నాది ఇప్పుడు నాది కాదుగా! ఇకమీదట నేను యెక్కడబడితే అక్కడ పడుకోడానికి అలవాటు పడాలి. ఇలా అని పించగానే అక్కడ పడుకోడానికి బుద్ధి కాలేదు. ''సినిమాకు వెళ్ళొద్దునా తాయారూ?'' అన్నాను. ఆవిడ చేతికి దొరికినంత చిల్లర తెచ్చి నా గుప్పిట్లో పోసింది. చక్కా యిలా వచ్చేశాను....''

''ఇదంతా యిలా యెందుకు జరిగిందో తెలియడం లేదండీ'' అన్నాను బాధగా.

''చెబుతానుగా! వినండి. ఏనుగు మ్రింగి వుమిసిన వెలగ పండులో డిప్ప మాత్రం అలాగే వుంటుందట. గుజ్జు మాత్రం మటు మాయమౌతుందట! సంపద సంగతీ అంతే. ఐనా నా కారణాలు నాకు లేకపోలేదు. పెద్ద వాణ్ణి వాడెందాకా చదువుకోవాలన్నాడో అందాకా చదివించానా? ముగ్గురమ్మాయిల్ని మంచి జాగాల్లో యిచ్చి పెళ్ళిళ్ళు చేశానా? బంధు బలగం హెచ్చిందా? చీరలు, సారెలు, పెట్టుపోతలు తప్పని సరైందా? ఇంట్లో ప్రతి పూటకూ పది విస్తళ్ళు వేసి తీయవల సిందే కదా! మీకు తెలియందేముంది? కొంద రికి సంపాదించడం చేతనౌతుంది. కొందరికి ఖర్చుపెట్టడం మాత్రమే చేతనౌతుంది. ఐనా మీరేం బాధపడొద్దు. పువ్వులమ్మిన వూళ్ళో కట్టెలమ్ముకోవాలని నాకైనా లేదు. పెద్దవాడు రమ్మని రాశాడు. అందరమూ కట్టగట్టుకుని వెళ్ళిపోతున్నాం. చేతికెదిగిన కుర్రాళ్ళు నలుగు రున్నారు. తలా నాలుగు రూకలు సంపాదించకపోరు. ఏలాగో ఓలాగా బ్రతి కేస్తాం. బ్రతుకును గురించి నాకేం దిగుల్లే దండీ మేష్టరుగారూ!''

మరొకరూ మరొకరూ అయితే వెన్నె ముక విరిగిపోయి నేలకంటుక పోవలసిన పరిస్థితే! అప్పల నరసయ్య గుండె నిబ్బ రాన్ని నేను మెచ్చుకోకుండా ఉండలేక పోయాను. కానీ మంచి పద్యంలో గణ భంగంవల్ల ఏర్పడిన అపశ్రుతిలా నేపథ్యం నుంచీ ఒక వెకిలి నవ్వు నాకు వినిపించక పోలేదు. చల్లకంటూ బయల్దేరి ముంతెందుకు దాచుకోవాలి? స్పష్టంగానే అడిగేశాను.

''లోకం కోడై కూస్తూ వుంది మరి! మీ చెవిదాకా వచ్చిందో లేదో తెలియదు. మీరు డబ్బంతా ఎక్కడో దాచిపెట్టి వుంటా రని అందరూ అనుకుంటున్నారు.''

అప్పల నరసయ్య నా చేతిని తన చేతి లోకి తీసుకున్నాడు— ''మేష్టరుగారూ! లోకమిప్పుడు నమ్మకమన్న ట్రంకు రోడ్డు పైన నడవడంలేదు. మనిషిపైన మనిషికి నమ్మకం లేకపోవడంవల్లనే ప్రమాణాలు, అగ్రిమెంట్లు, ప్రోనోట్లు కావలిసి వస్తు న్నాయి. ఈ మనుషుల్ని నమ్మించడానికి నేనేం చేయగలనో చెప్పండి! నేను కడుపు చించుకున్నాసరే! వీళ్ళది గారడీ విద్యే పొమ్మంటారు. పోనీ మిమ్మల్ని నే నొక మాటడుగుతాను. మీరైనా నమ్ముతారా నన్ను?''

నమ్ముతున్నానని మాటల్లో చెప్పడం తేలికే! కానీ హృదయం లోపలి సంగతి? నా ఒక్కడికి సంబంధించిన నిజా నిజాలను మాత్రం నేను నమ్మగలను, మిగిలిన వాళ్ళ పైన నాకు మాత్రం నమ్మకం ఎక్కడుండి ఏడ్చింది? నేనూ లోకంలో ఒక్కణ్ణేగద!

కళ్ళు మూసుకుని యితరుల్ని నమ్మలేక పోవడంవల్ల మానవుడు అభాగ్యుడు. ఎదుటి వారి మనసుల్లోకి చొచ్చుక పోయే ఎక్స్‌రే చూపులు లేకపోవడంవల్ల అసమర్థుడు.

ఇంతకంటే నే నే నిర్ణయానికీ రాలేక పోయాను.

*   *

అప్పల నరసయ్య కథ అంతటితో ముగిసివుంటే నేనింతదూరం వ్రాయవలసి వచ్చేదిగాదు.

అప్పల నరసయ్య వెళ్ళి పోయి చాలా కాలమైంది. అతడి నిష్క్రమణవల్ల రంగం పేట సామాజిక జీవనానికి ఏర్పడిన నష్ట మేమీలేదు. యథాప్రకారంగా కొట్లు తెరుస్తు న్నారు. బేరసారాలు, లావాదేవీలు సాగి పోతున్నాయి. బజారులో సందడి తగ్గలేదు. నామట్టుకు నాకు మాత్రం అన్యాక్రాంతమై పోయిన అప్పల నరసయ్య యింటివైపు చూచినప్పుడల్లా మనస్సు చివుక్కుమంటూ వుండేది. 'మారాజు! పెళ్లాం బిడ్డల్ని ఎంట బెట్టుకుని అరిచ్చెంద్రుడిలా ఎళ్ళిపోయా డా పాపం!' అనుకునే వాళ్ళు కొందరు నాకంట పడ్డారు. ఇందుకు విరుద్ధంగా అప్పల నర సయ్యకిలా కావడమే సరైనశాస్తి అయి నట్టుగా భావించి సంబరపడిన వాళ్ళుసైతం లేకపోలేదు.

మానవ స్వభావంలో ఒక వైచిత్రి కనిపి స్తుంది. పదిరోజులపాటు ఏకధాటిగా ఎండలు కాస్తే ఇక బ్రతుకంతా ఎండలే ననుకుంటాం. ముసురుబట్టి నాలుగురోజులు జడివాన గురిస్తే యిక సూర్యుడి ముఖంచూచే యోగం లేదను కుంటాం. అప్పల నరసయ్య విషయంలో కూడా యిలాంటి వూహలే కొనసాగాయి. అతడు దివాలా తీసేశాడు. ఊరువిడిచి వెళ్ళి పోయాడు. తదనంతర పరిణామం అతడు పూర్తిగా చితికిపోవడమే! ఈ అభిప్రాయానికి గురిగావడంవల్ల అప్పల నరసయ్య క్రమ క్రమంగా రంగంపేట పౌరుల జ్ఞాపకాల్లో నుంచీ మాసిపోతూ వచ్చాడు.

ఇంతలో వుండి వుండీ అతణ్ణి గురించి ఒకటీ అరా కబుర్లు వినరాసాగాయి.

కన్నడ సీమలో వున్న ఒకానొక బస్తీలో అప్పల నరసయ్య పెద్దకొడుకు ఉద్యోగం చేస్తుండేవాడు. ఆ ప్రాంతంలో ఎక్కడో స్థిరపడి అతడు జీవనోపాధికోసం చిన్న పరి శ్రమ ఏదైనా నెలకొల్పుకో జూస్తున్నట్టు ఓ వార్త నా చెవిదాకా వచ్చింది. మొదట మొదట అతడు ప్రారంభించింది అప్పడాల పరిశ్రమే

నట! అదేమంత అచ్చిరాలేదు. అప్పడాల పరిశ్రమగూడా అపహాస్యం పాలైందనే విన్నాను.

నాలుగేళ్ళ క్రిందటి సంగతి. ఒకనాటి సాయంకాలం బజార్లో బంకు ఎదుట నిలబడి ఓ అగ్గిపెట్టె యిమ్మన్నాను. "అప్పల నరసయ్య అగ్గిపెట్టె యిమ్మంటారా?" అన్నాడు కొట్టు సాహేబు. "అదెప్పట్నించి?' అన్నాను విస్తుపోతూ, "మనవైపు వచ్చి మూడు మాసాలైంది. మీరింకా చూడలేదా? ఖరీ దాకుపైసలే, నికరంగా అరవై పుల్లలుంటాయి. మందు పైన మోపగానే పుల్ల మండడం గూడా నికరమే. ఏమిటనుకున్నారో బాబుగారూ! నా కొట్టులోనే రోజుకు రెండు డజన్లు ఎగిరిపోతున్నాయి...."

పుల్ల గీసిచూచాను. నిజం నిప్పులాంటిదంటారు గదా! నిప్పుగూడా నిజంలాగే మండింది.

అప్పల నరసయ్య నిజాయితీపైన నమ్మకంలేని వాళ్ళుసైతం అతడి అగ్గిపెట్టెలు విరివిగా కొంటూవుండడం గమనించాను.

ప్రారంభంలో ఒక సేల్స్‌మాన్ నెలకొకసారి పార్సెళ్లు పట్టుకొస్తుండేవాడు. ఆ తరువాత అతడు వారానికొకసారి రావలసివచ్చింది. మరి కొంతకాలం గడిచే సరికి అగ్గిపెట్టెలతో ఒక వ్యానే రాకపోకలు ప్రారంభించింది.

రంగంపేటలాంటి చిన్న పేట కొంపలోనే నెలకొక రెండువందల రూపాయల సరుకు అమ్ముడు బోతున్నట్టు పరిశీలకులు అంచనా వేశారు. ఈ లెక్కన దేశంపైన ఎన్నివేల రూపాయల బేరం జరగడానికి వీలుంటుందో ఊహించి చూచారు. ఒయబ్బో, గుండె గుభేలుమనే పెద్దమొత్తమే అది! అప్పల నరసయ్య అగ్గిపుల్ల మాత్రమే గాదు. అతడు గూడా ఓ వెలుగు వెలుగుతూ వుండాలి ఈ పాటికి!

తన వునికికి సాక్ష్యంగా, తన విజయానికి వ్యాఖ్యానంగా అగ్గిపెట్టెలు దిగుమతి చేస్తూ వచ్చిన అప్పల నరసయ్య ఉన్నట్టుండి తానే స్వగ్రామంలో ప్రత్యక్షమయ్యాడు. పదేళ్ళకు మునుపు తలవంపుల నడుమ, తల వంచుకుని వెళ్ళిపోయిన మనిషి. యిప్పుడు తల పైకెత్తుకుని నిటారుగా నడుచుకుంటూ రంగంపేటలో ప్రవేశించాడు.

వచ్చినవాడు యింటింటికీ వెళ్ళి పెద్దలైన వాళ్ళ కుశల విషయాలు విచారించాడు. పేరు పేరునా పరిచితులను పలకరించాడు. మా బడికి గూడా వచ్చి గోడ గడియారం సరిగ్గా పని చేస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నాడు.

"కొద్ది రోజులపాటు వుంటారా ఇక్కడ?" అన్నాను.

"ఉందామనే వచ్చాను. కానీ యిక్కడి పరిస్థితి చూస్తుంటే వీలైనంత తొందరగా వెళ్లిపోవాలనిపిస్తోంది. వెళ్ళేలోగా మీతో కొంచెం మాట్లాడాలి. సాయంకాలం వీలుంటుందా మీకు?"

సాయంకాలం అప్పల నరసయ్యే స్కూలు దగ్గరికి వచ్చాడు. చాలాసేపటివరకూ పరధ్యానంగా వుండిపోయి, చివరకు "ఇదేం బాగుండలేదండీ మేష్టరుగారూ!" అన్నాడు.

ఏది బాగుండడంలేదు? ప్రశ్నార్థకంగా అతడివైపు చూచాను.

"ఎంతోకాలం తర్వాత నేను నా వూరికి తిరిగి వచ్చాను. నిజానికి ఈ వూరివల్ల నా కొరిగి పోయిం దేమీలేదు. నేను నాకున్నదంతా యిక్కడే పోగొట్టుకున్నాను. పైబట్ట విదిలించి భుజాన వేసుకుని వట్టి చేతులతో దేశంపైకి వెళ్ళి పోయాను. మేడ, కారు, మందీ, మార్బలం లాంటి హంగులు యిప్పుడైతే నాకుండొచ్చు. కానీ వూరు వదిలిపెట్టిన క్రొత్తలో నే నెన్ని పూటలు పస్తున్నానో వీళ్ళకు తెలియదు. నే నొకరికి సంజాయిషీ చెప్పుకోవలసింది లేదు. మీకు మాత్రం చెబుతున్నాను. పెద్దల్లుడు అప్పుగా యిచ్చిన రెండువేల పెట్టుబడితోనే నేను కొత్త జీవితం మొదలెట్టింది! బ్రతికి చెడిన వాణ్ణి గదా. ఈ డబ్బుయొక్క అంతేమిటో తేల్చుకోకుండా నిద్రపోగూడదనుకున్నాను. కానీ యిన్నాళ్లు గడిచాక యిప్పుడు నా చింత ఏమిటంటే, ఈ వూరివాళ్ళు నే నిలా బాగుపడడానికి వెనుక ఏదో పెద్ద కుట్ర వున్నట్టు భావిస్తున్నారు. నోటితో మాట్లాడుతూ నొసలితో వెక్కిరిస్తున్నారు. ప్రతి మాటకూ రెండర్థాలు వచ్చేటట్టుగా మాట్లాడుతూ నన్ను హింసిస్తున్నారు!...."

అప్పల నరసయ్య అమాయకత్వానికి నాకు కాస్తా నవ్వు వచ్చినమాట నిజం. నే నన్నాను—"కాయామీదే! కత్తీమీదే! మీ వూరి వాళ్ళను గురించి నేను మీకేం చెప్పగలను? డబ్బంతా ఎక్కడో పదిలం చేసి, అప్పుల వాళ్ళకు ఎగనామం పెట్టడంకోసం మీరు కడపటి నాటకం ఆడివుంటారని వీళ్ళ వూహ. అది వట్టి అపోహే గావచ్చు. మీరు బాగుపడక మునుపు అదివున్నా లేనట్టుండేది. ఇప్పుడు బాగా గట్టి పడిపోయింది...."

"మేష్టరుగారూ! ఒకరి దగ్గరమాట పడవలసిన అవసరం నాకులేదు...." ఇంచుమించు గద్దించినట్టుగా అన్నాడు అప్పల నరసయ్య.

నేను ఉలిక్కిపడ్డాను. అంతలో తమాయించుకుని "మాట పడడంగానీ, పడకపోవడం గానీ మనచేతిలోనే వుందంటారా?" అన్నాను.

"నా చేతిలో వుందనే నే ననుకుంటున్నాను. ఆ మాట ఋజువుగూడా చేస్తాను. వేచి చూడండి."

స్వప్రయత్నంతో డబ్బు సంపాదించి ఒక స్థాయికి చేరుకున్న వ్యక్తికి ఆమాత్రం ఆత్మవిశ్వాసం వుండడం సబబే. డబ్బుతో బాటుగా అతడీ మధ్య నిజాయితీని ఋజువు చేసుకునే చిట్కాలుగూడా సంపాదించి వుండొచ్చు. ఐనా తినబోతూ రుచి లడగడమెందుకు? అప్పల నరసయ్య జీవిత నాటకంలో మొదటినుంచీ నాది ప్రేక్షకుడి పాత్రే! ఇప్పుడిందులో పతాక సన్నివేశం రాబోతున్నదని అతడు తనంతట తానే హెచ్చరిక చెబుతున్నాడు. తప్పకుండా వేచి చూడవలసిందే!



అప్పల నరసయ్య పదిమంది పెద్ద మనుషుల్ని గ్రామ చావడిలో సమావేశ పరిచాడు. ముసుగులో గుద్దులాటల్లేకుండా సూటిగా తన ప్రతిపాదనను బయటపెట్టాడు.

పదేళ్ళనాడు సరిగ్గా యిలాగే కొందరు పెద్దమనుషులు తన అప్పుల వ్యవహారం పరిష్కరించడంకోసం యిక్కడ సమావేశ మయ్యారు. అప్పుడు అప్పులవాళ్ళ చేతుల్లో ప్రోనోట్లు వుండేవి. ఎటొచ్చీ వాటిని పూర్తిగా రద్దుచేసే స్థితిలో తా నప్పుడు లేడు. పాపం, వాళ్ళు తన మూలంగా నష్టపడ్డారు. ఆ నష్టాన్ని మాఫీ చేసే అవకాశం తన కిప్పుడు వచ్చింది. ప్రోనోటనేవి వట్టి కాగితం. మనిషి మాటమీద నిలబడకపోతే అది కుంకం గట్టుకోడానికైనా పనికి రాదు. లోకంచేత మాట పడకుండా వుండడం కోసం తా నిప్పుడీ పనిచేస్తున్నాడు. ఎవరెవరికి ఎంతెంత సొమ్ము ముట్టవలసివుందో, ఆ వివరాలన్నీ తనకు జ్ఞాపకమున్నాయి. ఒక్కొక్కరుగా వచ్చి వాళ్ళకు రావలిసిన డబ్బు తీసుకోవచ్చు....

కొద్ది క్షణాలపాటు చావడిలో గాలిగూడా స్తంభించిపోయినట్టే తోచింది.

ఒకరి ముఖం ఒకరు చూచుకోడాలుగా, గుసగుసలు పోవడాలుగా, తీరా యిమ్మని చేయిజాపితే లేదు పొమ్మని వెకిలినవ్వు నవ్వుతాడేమో నని తటపటాయించడాలుగా చావడిలో సంచలనం ప్రారంభమైంది. అప్పల నరసయ్య జేబులోనుంచీ నోట్ల కట్టలు తీసేసరికి అనుమాన మేఘాలు విచ్చిపోయాయి. లక్ష్మీ సాక్షాత్కారం గదా మరి!

ఆరోజు రాత్రి అప్పల నరసయ్య నిశ్చింతగా నిద్రపోయి లేచాడు.

"మేష్టరుగారూ! ఈరోజు సాయంకాలం నేను వెళ్ళిపోతున్నాను. మధ్యాహ్నం నాకు మీ యింట్లోనే భోజనం" అన్నాడు.

సాయంకాలమైంది. తనకు వీడ్కోలు చెప్పడానికి చాలామంది రావచ్చునని అప్పల నరసయ్య ఆశించాడు. అలాంటిదేమీ జరగలేదు. పైగా ఎదురైన ప్రతి వ్యక్తీ నీ సంగతి మాకు బాగా తెలిసిపోయింది లేవోయ్ అన్నట్టుగా ప్రవర్తించడం అప్పల నరసయ్యకు కాస్తా ఆశ్చర్యాన్నే కలిగించి వుండాలి. సాగనంపడానికి నేనొక్కణ్ణి మాత్రమే మిగిలాను.

బండి రావడానికింకొక యిరవై నిమిషాల వ్యవధి వుండనగా ప్లాట్‌ఫారం పైన అప్పల నరసయ్య నోరు తెరిచాడు.

"మేష్టరుగారూ! ఊరివాళ్ళందరూ ఏమనుకుంటున్నారు?"

"నేనుగూడా ఆ ప్రశ్నకోసమే వేచి వున్నాను" అన్నాను.

"అలాగా?" అన్నాడు విస్మయంతో.

"అవును. ఎప్పుడు చెప్పవలసిన మాట అప్పుడు చెప్పలేకపోతే మళ్ళీ అదొక కొరతగా వుండిపోతుంది. నిజం నిష్ఠూరంగానే వుండొచ్చు. కానీ దాన్ని గుర్తించడానికి నిరాకరించడంవల్ల మనకే నష్టం. ఊరివాళ్ళందరూ మీకు మతి కాస్తా చెడివుంటుందని అభిప్రాయ పడుతున్నారు...."

"నాకా! మతి పోయిందనుకుంటున్నారా?" ఖిన్నుడై పోతూ అడిగాడు అప్పల నరసయ్య.

"అంతపనీ జరగకపోతే మీరు డబ్బులు తీసుకొచ్చి యిలా వెదజల్లి వుండరని వీళ్ళ అనుమానం. అప్పటికీ అదే నయం. నిన్న మీ దగ్గర పైకం పుచ్చుకున్న ఆసాములున్నారే వాళ్లు బంగారంలాంటి మాట ఒకటి సెలవిస్తున్నారు "ఇందులో అప్పల నరసయ్య గొప్ప ఏముంది లెద్దురూ! మా డబ్బు గట్టిది గనుక మమ్మల్ని వెదుక్కుంటూ వచ్చింది" అంటూ తెగేసి చెబుతున్నారు."

రెప్ప కదలని కళ్ళతో అప్పల నరసయ్య నావైపు చూస్తూ నిల్చున్నాడు.

"ఇంతటితో ముగిస్తే నేను మీకు పూర్తి నిజం చెప్పినట్టు కాదు. చెప్పడానికైనా, వినడానికైనా యిదేమంత యింపితమైన విషయం గాకపోవచ్చు. ఐనా మన బాధను మనం గరళంలా దిగమ్రింగుకోక తప్పదు. సౌజన్యం గాజువస్తువులాంటిది. పదిలంగా దాచుకునేవాళ్ళ చేతిలో పడితే మాత్రమే అది కలకాలం నిలుస్తుంది. లేకుంటే పగిలిపోతుంది. మీరు మీ సౌజన్యాన్ని దుర్వినియోగం చేశారు. నిన్నటి మీ చర్యపైన బయల్దేరిన వ్యాఖ్యానాల్లో రెంటిని మాత్రం మీతో చెప్పాను. మూడోది, ముఖ్యమైనది యింకొకటుంది...."

"పరవాలేదు. చెప్పండి!"

"ఏం లేదు. ఎలాంటివాళ్ళకయినా వయసుడిగిపోయిన రోజుల్లో పాపభీతి పుట్టుకొస్తుందట! అంటే ఏమిటి? ఇంత జరిగినా వీళ్ళకు మీ నిజాయితీపట్ల నమ్మకం కలగలేదన్నది అంతరార్థం. అనగా ఏమిటి? మళ్ళీ కథ మొదటికే వచ్చిందన్నమాట!"

పొగలు గ్రక్కుతూ బండి వచ్చి స్టేషనులో ఆగింది.

—:౦:—